ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5 తమిళనాడు TAMILNADU

గురువారం 26 సెప్టెంబరు 2024

చెట్టును ఢీకొన్న వ్యాన్

ఇద్దరు మహిళలు సహా ఆరుగురి మృతి

● 14 మందికి గాయాలు



వ్యాన్‌లో నుండి గాయపడిన వారిని వెలికి తీస్తున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు



ప్రమాదంలో ధ్వంసమైన వ్యాన్ ముందుభాగం

చెన్నై, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కళ్లకురిచ్చి జిల్లా ఉలుందూరుపేట వద్ద బుధవారం వేకువజామున సంభవించిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మహిళలు సహా ఆరుగురు మృతిచెందారు. మరో 14 మంది తీవ్రంగా గాయపడి విల్లుపురం ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. తిరువణ్ణామలై జిల్లా ఆరణి సమీపం మాంబాక్కం వాళపందల్ ప్రాంతానికి చెందిన సుమారు 20 మంది మంగళవారం తిరుచెందూరు ఆలయానికి వ్యాన్‌లో వెళ్ళారు. దర్శనానంతరం వీరంతా వ్యాన్‌లో స్వస్థలానికి బయలుదేరారు. బుధవారం వేకువజామున తిరుచ్చి - చెన్నై జాతీయ రహదారిలో కళ్లకురిచ్చి జిల్లా ఉలుందూరుపేట సమీపం మేడత్తూరు వద్ద వ్యాన్ అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీకొంది. ఈదుర్ఘటనలో వ్యాన్‌లో ప్రయాణించిన మురుగన్ (58), శక్తి (23), కుట్టి అలియాస్ సెల్వం (52), దురై (44), రామలింగం (55) సహా ఆరుగురు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మరణించారు. మరో 14 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదం సమాచారం అందగానే తిరునావలూరు పోలీసులు, ఉలుందూరుపేట అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన అక్కడికి చేరుకుని వ్యాన్ శిథిలాల నుంచి మృతదేహాలను వెలికి తీసి పోస్టుమార్టంకు, గాయపడినవారిని చికిత్స నిమిత్తం విల్లుపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదం కారణంగా ఆ రహదారిలో గంటకు పైగా ట్రాఫిక్ స్తంభించింది. తిరునావలూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

ఆయువు తీసిన అప్పులు

కుటుంబం సహా పారిశ్రామిక వేత్త ఆత్మహత్య



నమున సముద్రం వద్ద పారిశ్రామికవేత్త మణికంఠన్ కారు

● పుదుకోటవద్ద కారులో మృతదేహాలు లభ్యం

చెన్నై, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): చేసిన అప్పులు తీర్చలేక కుటుంబం సహా ఓ వ్యాపారవేత్త బలవన్మరణానికి పాల్పడిన ఘటన పుదుకోట సమీపం నమున సముద్రం వద్ద జరిగింది. నమున సముద్రం సమీపంలో 'నగర శివ మఠం' అనే భవనం ఎదుట పార్కింగ్ చేసిన కారులో ఈ ఐదుగురి మృతదేహాలు లభ్యమయ్యాయి. నగర శివమఠం భవనం వాచ్‌మాన్ అడైకలం బుధవారం ఉదయం ఆ ప్రాంతంలో పార్కింగ్ చేసి ఉన్న కారు వద్దకు వెళ్లి చూడగా అందులో ఇద్దరు మహిళలు సహా ఐదుగురు శవాలుగా పడి ఉండడంతో వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చాడు. నమున సముద్రం పోలీసులు అక్కడికి చేరుకుని కారులో మృతదేహాలను వెలికి తీసి పోస్టుమార్టంకు తరలించారు. వేలిముద్రల నిపుణుల రప్పించి పరిశీలన జరిపారు. ఆ సమయంలో కారులో ఓ లేఖను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆ లేఖలోని సమాచారం మేరకు సేలం జిల్లా ఆత్తూరుకు చెందిన మణికంఠన్ (50), అనే పారిశ్రామిక వేత్త అప్పుల బాధ ఎక్కువై, వాటిని తీర్చలేక భార్య నిత్య (48), తల్లి సరోజా (70), కుమారుడు ధీరన్ (20), కుమార్తె నిహారిక (22)తో కలిసి కారులోనే విషంతాగి ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసుల ప్రాథమిక విచారణలో మణికంఠన్ పుదుకోట సిప్కాట్‌లో వ్యాపార లావాదేవీలు నడుపుతుండేవాడని, ఇటీవల వ్యాపారంలో తీవ్రంగా నష్టపోయి, అప్పుల పాలై వాటిని తీర్చలేక, అప్పులిచ్చినవారి వేధింపులు తట్టుకోలేక కుటుంబ సభ్యులతో కలిసి ఆత్మహత్య చేసుకున్నట్లు వెల్లడైంది.

నేడు ఢిల్లీ వెళ్లనున్న స్టాలిన్

● రేపు ప్రధాని మోదీతో భేటీ


చెన్నై, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి స్టాలిన్ గురువారం సాయంత్రం ఢిల్లీ బయలుదేరి వెళుతున్నారు. రాత్రి తమిళనాడు హౌస్‌లో బస చేసి, శుక్రవారం ఉదయం 11 గంటలకు ఆయన ప్రధాని నరేంద్రమోదీని కలుసుకోనున్నారు. ఆ సందర్భంగా రాష్ట్రంలో అమలు చేస్తున్న కీలకమైన పథకాలకు నిధులు కేటాయించాలని కోరుతూ వినతి పత్రాన్ని సమర్పించనున్నారు. నగరంలో రెండో విడత మెట్రోరైలు ప్రాజెక్టు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ ప్రాజెక్టుకు రూ.63,246 కోట్ల మేరకు వ్యయం కాగలదని అంచనా వేశారు. ఈ ప్రాజెక్టుకు నిధులు కేటాయించమంటూ ముఖ్యమంత్రి పలు మార్లు కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని మోదీకి విజ్ఞప్తి చేసినా ఇప్పటివరకూ నిధులు విడుదల కాలేదు. ఇదిఇలా ఉండగా కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన నూతన విద్యావిధానాన్ని అమలు చేసేందుకు నిరాకరించడంతో రాష్ట్రానికి విడుదల చేయాల్సిన విద్యా సంబంధిత నిధులను కూడా కేంద్రం నిలిపివేసింది. అత్యంత కీలకమైన ఈ రెండు విషయాలపై ప్రధాని నరేంద్రమోదీతో చర్చలు జరిపి, కేంద్ర నుండి నిధులు మంజూరు చేయించుకోవాలనే స్టాలిన్ ఢిల్లీకి బయలుదేరి వెళుతున్నారు. శుక్రవారం మోదీని కలుసుకున్న తర్వాత ఆయన ఆ రోజు సాయంత్రమే నగరానికి తిరిగి వస్తున్నారు.

మద్యం తాగి మహానాడుకు రావొద్దు

పార్టీ శ్రేణులకు విజయ్ నిబంధనలు



ప్యారీస్, సెప్టెంబరు 25: విల్లుపురం జిల్లా విక్రవాండిలో అక్టోబరు 27న నిర్వహించనున్న తమిళగ వెట్రి కళగం (టీవీకే) మహానాడును విజయవంతం చేయాలని, ఎట్టి పరిస్థితుల్లో మద్యం సేవించి మహానాడులో పాల్గొనరాదని ఆ పార్టీ వ్యవస్థాపకుడు, సినీ నటుడు విజయ్ సూచించారు. టీవీకే మొట్టమొదటి రాష్ట్రస్థాయి మహానాడు ఘనంగా నిర్వహించాలని నిర్ణయించిన పార్టీ అధిష్ఠానం అందుకోసం విల్లుపురం జిల్లా చెన్నై-తిరుచ్చి జాతీయ రహదారిలో విక్రవాండి నియోజకవర్గ పరిధిలో సుమారు 85 ఎకరాల్లో నిర్వహించేందుకు చర్యలు చేపట్టింది. పోలీసులు 33 నిబంధనలతో మహానాడు నిర్వహణకు అనుమతించిన నేపథ్యంలో, బుధవారం పార్టీ కార్యకర్తలకు కట్టుబాట్లు విధించినట్లు విజయ్ పేర్కొన్నారు. వేదిక ప్రాంతంలోని రహదారిలో వాహనాల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలిగించకూడదని, ముఖ్యంగా ద్విచక్రవాహనాల్లో వచ్చే పార్టీ క్యాడర్లు సాహసాలకు పాల్పడరాదని, మహానాడుకు భద్రత కల్పించే పోలీసుల పట్ల మర్యాదగా, గౌరవంగా వ్యవహరించాలని, వేదిక ప్రాంగణంలో బావులు, ప్రమాదకరమైన ప్రాంతాలుంటే అప్రమత్తంగా ఉండాలని, ప్రధానంగా మద్యం సేవించిన కార్యకర్తలను వేదిక ప్రాంగణంలోకి అనుమతించబోమని తదితర నిబంధనలను కార్యకర్తలంతా తప్పనిసరిగా పాటించాలని విజయ్ ఆదేశించారు.



ముఖ్యమంత్రి నుంచి కానుకలందుకున్న చేనేత కళాకారులు, డిజైనర్లు

రాష్ట్రానికి మరింత ఖ్యాతిని తీసుకురండి

చేనేత కళాకారులను, పారాలింపిక్స్ విజేతలను సత్కరించిన సీఎం స్టాలిన్

అడయార్, సెప్టెంబరు 25: కళాకారులు, క్రీడాకారులు రాష్ట్రానికి మరింత ఖ్యాతిని తీసుకువచ్చేలా కృషి చేయాలని సీఎం స్టాలిన్ సూచించారు. బుధవారం ఉదయం సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో పట్టు, పత్తి చీరలు, దుస్తుల తయారీ, డిజైన్లు రూపొందించటంలోనూ అత్యంత ప్రతిభా పాటవాలు ప్రదర్శించిన చేనేత, హస్త కళాకారులను, పారాలింపిక్స్ క్రీడాకారులను ముఖ్యమంత్రి స్టాలిన్ ఘనంగా సన్మానించారు. ముందుగా జరిగిన కార్యక్రమంలో 12 మంది చేనేత కళాకారులు, డిజైనర్లకు రూ.22.65 లక్షల నగదు పురస్కారాలను ఆయన అందజేశారు. రాష్ట్ర స్థాయిలో పట్టు, ప్రత్తి రకాలకు ఉత్తమ చేనేత కార్మికుల అవార్డులు, ఉత్తమ డిజైనర్లు, ఉత్తమ యువ డిజైనర్ల కోసం మొత్తం 12 మందిని ప్రభుత్వం ఎంపిక చేసింది. వీరిని సీఎం స్టాలిన్ సన్మానించి, నగదు పురస్కారాన్ని ప్రదానం చేశారు. రాష్ట్ర స్థాయిలో ఉత్తమ యువ డిజైనర్ బహుమతిని కరూర్‌కు చెందిన వళ్ళువర్ సైన్స్ అండ్ మేనేజ్‌మెంట్ కాలేజీకి చెందిన మొదటి సంవత్సర విద్యార్థిని దర్షణ గెలుచుకున్నారు. రెండో బహుమతిని మదురైకు చెందిన శంకర్, మూడో బహుమతి కోయంబత్తూరు పీఎస్‌జీ కాలేజీకి చెందిన మొదటి సంవత్సర విద్యార్థిని హరిణి గెలుచుకున్నారు. ఈ ముగ్గురుకి రూ.2.25 లక్షల చెక్కు అందజేశారు. అలాగే, ఉత్తమ ప్రతిభను చూపిన చేనేత కార్మికులను కూడా సన్మానించారు. ఈ కార్యక్రమంలో చేనేత శాఖామంత్రి గాంధీ, ఆ శాఖ కార్యదర్శి ధర్మేంద్ర ప్రతాప్ యాదవ్, చేనేత శాఖ డైరెక్టర్ షణ్ముగ సుందరం, ఇతర ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు రూ.5 కోట్ల నజరానా

ఇటీవల పారిస్ వేదికగా జరిగిన పారాలింపిక్స్‌లో పతకాలు సాధించిన రాష్ట్రానికి చెందిన నలుగుకు క్రీడాకారులకు ప్రోత్సాహక బహుమతిగా ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ రూ.5 కోట్లు అందజేశారు. క్రీడా శాఖలో రాష్ట్రాన్ని అగ్రపథంలో నిలబెట్టేందుకు ప్రభుత్వం అనేక రకాల చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా, శిక్షణ, తగిన ప్రోత్సాహక నగదు అందజేయడం, క్రీడాకారులకు అవసరమైన మౌలిక సదుపాయాలను రూపకల్పన వంటి చర్యలను చేపడుతంది. అలాగే, పారిశ్రామికవేత్తలు, ధనవంతుల నుంచి విరాళాలు సేకరించే నిమిత్తం తమిళనాడు చాంపియన్స్ చారిటబుల్ పేరుతో ఒక ట్రస్ట్ కూడా ఏర్పాటు చేసింది. ఈ నిధులతో క్రీడాకారులకు అంతర్జాతీయ స్థాయిలో అన్ని రకాల సాయం అందిస్తుంది. ఇదిలావుంటే, పారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొన్న రాష్ట్రానికి చెందిన 16 మంది క్రీడాకారులకు ప్రత్యేక ప్రోత్సాహక నగదు బహుమతి కింద రూ.7 లక్షలు చొప్పున ప్రభుత్వం అందజేసింది. అలాగే, పతకాలు సాధించిన తులసిమతికి రూ.2 కోట్లు, నిత్యశ్రీ, మనీషాలకు రూ.కోటి చొప్పున మొత్తం రూ.5 కోట్ల నగదు పురస్కారాలను ముఖ్యమంత్రి స్టాలిన్ అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్రీడాశాఖామంత్రి ఉదయనిధి, కార్యదర్శి అతుల్ మిశ్రా, తమిళనాడు క్రీడాభివృద్ధి కమిషన్ సభ్యుడు మేఘనాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సచివాలయంలో యువజన సంక్షేమం క్రీడాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి నుంచి నగదుకానుకలు స్వీకరించిన పారాలింపిక్స్ విజేతలు తులసిమది, నిత్యాశ్రీ, మనిషా, మారియప్పన్



పొగను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

దుబాయ్ విమానంలో పొగలు

● సమగ్రవిచారణకు ఆదేశం

చెన్నై, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక మీనాంబాక్కం అంతర్జాతీయ విమానాశ్రయంలో ఇంధనం నింపే సమయంలో దుబాయ్ విమానం వెనుక నుంచి పొగలు వచ్చిన సంఘటనపై పౌరవిమానయాన సంస్థ సమగ్ర విచారణకు ఆదేశించింది. మంగళవారం రాత్రి 9.50 గంటలకు దుబాయ్ బయలుదేరటానికి ఓ విమానం సిద్ధమైంది. ఆ విమానంలో ఎక్కేందుకు 314 మంది ఉన్నారు. ఆ విమానంలో ఇంధనం నింపుతుండగా ఉన్నట్టుండి ఇంజన్ నుండి దట్టమైన పొగలు వచ్చాయి. వెంటనే అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని పొగలను అదుపు చేశారు. ఆ తర్వాత ఇంజనీరింగ్ నిపుణులు ఆ విమానాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి ప్రయాణికులను అనుమతించారు. రాత్రి 12.30 గంటల తర్వాత ఆ విమానం దుబాయ్‌కి బయలుదేరింది. కాగా ఈ సంఘటనలో ఇంధనం నింపే సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిచడం వల్లే ఇంజన్ నుండి పొగలు వచ్చాయనే ఆరోపణలతో పౌరవిమానయాన సంస్థ సమగ్రమైన విచారణకు ఆదేశాలు జారీ చేసింది.

నగరంలో వర్షం

చల్లబడిన వాతావరణం



వర్షంలో వెళ్తున్న వాహనాలు

చెన్నై, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగరం చెన్నైలో బుధవారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. వాతావరణం చల్లబడటంతో వారం రోజులుగా ఉక్కపోతతో అలమటించిన నగరవాసులు ఊరట చెందారు. మంగళవారం అర్ధరాత్రి నగరంలో పలు ప్రాంతాల్లో ఉరుములు మెరుపులతో వర్షం కురిసింది. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ ఎప్పటివలెనే నగరంలో ఎండ కాసింది. ఆ తర్వాత సాయంత్రం నాలుగు గంట నుండి చిరుజల్లులతో ప్రారంభమైన వర్షం కాసేపటికి ఊపందుకుంది. ఎగ్మూరు, అన్నాసాలై, పుదుపేట, అడయారు, వడపళని, కోట్టూరుపురం, ఆళ్వార్‌పేట, వేళచ్చేరి, మడిపాక్కం, మధురవాయల్, తిరుమళిసై, పూందమల్లి, ఓల్డ్ వాషర్‌మెన్‌పేట, తండయార్‌పేట తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. దీంతో రహదారుల్లో వర్షపు నీరంతా వరదలా ప్రవహించింది. ఇదే విధంగా కాంచీపురం జిల్లా ఓర్కిక్కై, సెవిలిమేడు, పెరియార్‌నగర్, వాలాజాబాద్ ప్రాంతాల్లో భారీగా వర్షం కురిసింది.



వర్షంలో తడుస్తున్న విద్యార్థినులు

డీఎంకే, డీపీఐ మధ్య ఎలాంటి విభేదాల్లేవ్!

● తొల్ తిరుమావళవన్



కోవైలో విలేఖరులతో మాట్లాడుతున్న తిరుమావళవన్

చెన్నై, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : కూటమిలో తమ పార్టీకి డీఎంకే మధ్య ఎలాంటి విభేదాలు లేవని, రెండు పార్టీల మధ్య చిచ్చురగిల్చేందుకు ప్రత్యర్థులు పన్నిన కుతంత్రాలు ఫలించలేదని డీపీఐ నేత తొల్ తిరుమావళవన్ స్పష్టం చేశారు. కోవైలో బుధవారం ఉదయం ఆయన మీడియాతో మాట్లాడుతూ అధికారంలో భాగస్వామ్యాన్ని కోరుకునేలా ఇటీవల తన ఎక్స్‌పేజీలో విడుదల చేసిన రెండు పాత వీడియోలు వివాదాస్పదంగా మారాయని, అంతమాత్రానికే రెండు పార్టీల మధ్య విభేదాలు ఏర్పడయ్యాంటూ ప్రత్యర్థులు విమర్శలకు దిగారని చెప్పారు. ఇక కూటమి ధర్మానికి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేసిన డీపీఐ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఆదవ్ అర్జునపై ఎలాంటి చర్యలు తీసుకోవాలనే విషయంపై పార్టీ అధిష్ఠానంతో తగు నిర్ణయం తీసుకుంటుందన్నారు. ఆదవ్ అర్జున ఇటీవల ఓ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఉత్తరాది జిల్లాల్లో డీపీఐ పలుకుబడి వల్లే డీఎంకే గెలిచిందన్నారు. నాలుగు దశాబ్దాలుగా రాజకీయాల్లో డీపీఐ నాయకుడు తిరుమావళవన్ ఎందుకు డిప్యూటీ సీఎం కాకూడదంటూ ప్రశ్నించారు. అదే సమయంలో మంత్రి ఉదయనిధికి డిప్యూటీ సీఎం పదవి ఇచ్చేందుకు డీఎంకేలో జరుగుతున్న ప్రయత్నాలపై విమర్శలు కూడా చేశారు. కూటమి ధర్మానికి వ్యతిరేకంగా డీఎంకేపై విమర్శలు చేసిన ఆదవ్ అర్జునపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎంపీ రాజా చేసిన డిమాండ్‌ను విలేఖరులు ప్రస్తావించినప్పుడు ఈ విషయమై పార్టీ సీనియర్లతో చర్చలు జరిపిన తర్వాతే చర్యలు తీసుకుంటానని తెలిపారు.

సమాచార ధ్వని

29న మారథాన్

ఐసిఎఫ్, సెప్టెంబరు 25: లెథర్ ఎగుమతి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 29వ తేది నగరంలో మారథాన్ నిర్వహించనున్నారు. మత్తులేని సమాజాన్ని రూపొందించేలా 'సోల్స్ ఫర్ సోల్స్' పేరుతో ఐల్యాండ్ గ్రౌండ్‌లో ఈ మారథాన్ నిర్వహించనున్నారు. రాష్ట్రప్రభుత్వం సహకారంతో జరుగనున్న ఈ మారథాన్‌లో పాల్గొనేందుకు https://beonly.in/solesfor-souls/ అనే వెబ్‌సైట్‌లో పేరు నమోదుచేసుకోవాలి. మారథాన్‌లో పాల్గొనే అందరికీ టీ-షర్ట్, పతకం, ఈ-సర్టిఫికేట్, తాగునీరు, అల్పాహారం అందజేయనున్నట్లు లెథర్ ఎగుమతి సంస్థ డైరెక్టర్ సెల్వం తెలిపారు.

రేపు గిండిలో జాబ్ మేళా

ఐసిఎఫ్, సెప్టెంబరు 25: స్థానిక గిండిలో శుక్రవారం జాబ్ మేళా జరుగనుంది. ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయం ప్రాంగణంలో 20కి పైగా ప్రైవేటు సంస్థల ఆధ్వర్యంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అభ్యర్థులను ఎంపిక చేయనున్నారు. 8వ తరగతి నుంచి ప్లస్ టూ, డిప్లొమో, డిగ్రీ చదివిన వారు ఈ శిబిరంలో పాల్గొనవచ్చు. ఔత్సాహికులు www.tnprivatejobs.tn.gov.in అనే వెబ్‌సైట్‌లో పేరు నమోదుచేసుకోవాలని అధికారులు తెలిపారు.

తిరుచెందూర్ హుండీ ఆదాయం రూ.5.15 కోట్లు

పెరంబూర్, సెప్టెంబరు 25: తిరుచెందూర్ మురుగన్ ఆలయ హుండీ ఆదాయం రూ.5.15కోట్లు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ నెలలో సందర్శించిన భక్తులు స్వామివారి హుండీలో కానుకలు చెల్లించారు. ఆలయ ప్రాంగణంలో వసంత మండపంలో రెండు రోజులు హుండీ లెక్కింపు జరిగింది. రూ.5.15కోట్ల నగదుతో పాటు 2 కిలోల బంగారం, 41 కిలోల వెండి, 1,589 విదేశీ కరెన్సీ నోట్లు భక్తులు సమర్పించారని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

మదురైలో పరిశోధన పార్క్

ఐసిఎఫ్, సెప్టెంబరు 25: మదురైలో పరిశోధన పార్క్ టిడ్కో ఏర్పాటుచేయనుంది. తరమణిలో ఐఐటీ మెగా రిసెర్చ్ పార్క్ కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహిస్తోంది. ఇదే విధంగా గ్రామీణ యువతకు ప్రోత్సహించేలా అన్ని జిల్లాల్లో విశ్వవిద్యాలయ పరిశోధన పార్క్‌లను టిడ్కో ఏర్పాటు చేయనుంది. మొదటి పార్క్ కోయంబత్తూర్‌లోని టైసల్ పార్క్‌లో ఏర్పాటు చేయనుంది.రెండవపార్క్ మదురైలో ఏర్పాటుచేయనున్నారు.

ఆర్థికసాయానికి దరఖాస్తుల ఆహ్వానం

ఐసిఎఫ్, సెప్టెంబరు 25: ప్రభుత్వం అందజేసే ఆర్థికసాయానికి వృద్ధులైన తమిళ పండితులు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు తెలిపారు. ప్రభుత్వం వీరికి ప్రతినెలా రూ.4,000 ఆర్థికసాయం అందజేయనుంది. దరఖాస్తులను మండల, జిల్లా తమిళ అభివృద్ధి డిప్యూటీ లేక సహాయక డైరెక్టర్ కార్యాలయాల్లో పొందవచ్చు. అలాగే, తమిళ అభివృద్ధి శాఖ వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకొని పూర్తిచేసి అక్టోబరు 31వ తేదిలోపు సమర్పించాలి. చెన్నైకి చెందిన వారు మాత్రం 'డైరెక్టర్, తమిళ అభివృద్ధి డైరెక్టరేట్, తమిళ్ సాలై, ఎగ్మూర్, చెన్నై-8' అనే చిరునామాలో నేరుగా సమర్పించి అందజేయవచ్చు.

గిండి ఆస్పత్రికి హరిత భవన గుర్తింపు

ఐసిఎఫ్, సెప్టెంబరు 25: స్థానిక గిండి ఆస్పత్రికి హరిత భవన అంగీకారం లభించింది. గిండి కింగ్స్ ఆస్పత్రి ప్రాంగణంలో రూ.240 కోట్లతో 1,000 పడకలతో మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి భవనం నిర్మించారు. జూన్ 15న ముఖ్యమంత్రి స్టాలిన్ ఆ భవనాన్ని ప్రారంభించారు. భవనాన్ని హరిత భవన విధానాలు పాటిస్తూ నిర్మించినట్లు ప్రజాపనుల శాఖ ప్రకటించింది. దీనికి సంబంధించిన సర్టిఫికెట్ పొందేందుకు ఈ శాఖ భారత వాణిజ్య సమాఖ్య (సీఐఐ) భారత హరిత భవనాల కౌన్సిల్‌కు దరఖాస్తు చేసుకుంది. నిపుణుల పరిశీలన అనంతరం భారత హరిత భవనాల కౌన్సిల్ గోల్డన్ సర్టిఫికెట్ అందజేసింది.

మెరీనాలో దుకాణాల తొలగింపు

ఐసిఎఫ్, సెప్టెంబరు 25: స్థానిక మెరీనా తీరంలో కార్పొరేషన్ అధికారులు దుకాణాలను తొలగించారు. భారత వైమానిక దళ 92వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని అక్టోబరు 6వ తేది 'ఎయిర్ షో' జరుగనుంది. మూడు సంవత్సరాలుగా డిల్లీలో మాత్రమే జరుగుతున్న ఈ కార్యక్రమం తొలిసారిగా నగరంలో జరుగనుంది. ఈ సందర్భంగా ఎయిర్ షో జరిగే ప్రాంతం చుట్టూ 500 మీటర్ల దూరంలోని అన్ని దుకాణాలను అధికారులు తొలగించారు.

25 వాణిజ్య సంస్థలకు నోటీసులు

ఐసిఎఫ్, సెప్టెంబరు 25: స్థానిక గిండిలో 25 వాణిజ్య సంస్థలకు అధికారులు నోటీసులిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని గిండి సిడ్కో కాంప్లెక్స్ లో ఉత్పత్తికి సంబంధించి 500లకు పైగా సంస్థలు ప్రారంభించేందుకు స్థలాలు కేటాయించారు. కొందరు నిబంధనలు ఉల్లంఘించి స్థలాలు విక్రయించడమే కాకుండా, ఇతర అవసరాలకు వినియోగిస్తున్నారు. దీనికి సంబంధించి ఫిర్యాదులందడంతో తనిఖీ చేసిన అధికారులు, ఇటీవల 10 దుకాణాలకు సీలు వేయగా, మంగళవారం ఒక హాస్టల్‌కు సీలు వేశారు. అలాగే, 25 వాణిజ్య సంస్థలకు సిడ్కో అధికారులు నోటీసులు జారీచేశారు.

టెన్త్, ప్లస్ వన్ విద్యార్థుల వివరాలు అప్‌లోడ్ చేయాలి

ఐసిఎఫ్, సెప్టెంబరు 25: టెన్త్, ప్లస్ వన్ పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థుల వివరాలు 'ఎమిస్' వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని ప్రధానోపాధ్యాయులకు ప్రభుత్వ పరీక్షల డైరెక్టరేట్ ఉత్తర్వులు జారీచేసింది. విద్యార్థుల పేరు, వివరాలు, తల్లిదండ్రులు, సంరక్షకుల పేర్లు, మొబైల్ నెంబరు, పాఠ్య విభాగం, మీడియం, చిరునామా, తల్లిదండ్రుల వార్షికాదాయం తదితర వివరాలు అక్టోబరు 15వ తేదిలోపు ఎమిస్ వెబ్‌సైట్‌లో ఉన్నత, మహోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అప్‌లోడ్ చేయాలని పేర్కొంది.

వందడుగులకు తక్కువగా మేట్టూరు డ్యాం

పెరంబూర్, సెప్టెంబరు 25: మేట్టూరు డ్యాం నీటిమట్టం 59 రోజుల అనంతరం వందడుగులకు తగ్గాయి. జూలై 27వ తేది మేట్టూరు డ్యాం 120 అడుగుల పూర్తి సామర్థ్యానికి చేరింది. ప్రస్తుతం వర్షాలు లేకపోవడం, కర్ణాటక డ్యాం నుంచి నీరు విడుదల చేయకపోవడంతో, బుధవారం నీటిమట్టం 99.7 అడుగులకు తగ్గింది. డెల్టా జిల్లాల సాగుకు డ్యాం నుంచి 15,000 ఘనపుటడుగుల నీరు విడుదల చేస్తుండగా, డ్యాంలోకి నీటి చేరిక 1,537 ఘనపుటడుగులుగా ఉంది.

మీనాక్షి అమ్మవారి ఆలయ లడ్డు నాణ్యమైనది

పెరంబూర్, సెప్టెంబరు 25: మదురై మీనాక్షి అమ్మవారి ఆలయ లడ్డు నాణ్యమైనదని ఆహార భద్రతా శాఖ అధికారులు తెలిపారు. మీనాక్షి అమ్మవారి ఆలయ లడ్డులో ఎలాంటి కల్తీ లేదని పరిశోధనల్లో నిర్ధారణ అయిందని తెలిపారు. పలు పరీక్షల అనంతరం భక్తులకు లడ్డు ప్రసాదంగా అందజేస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

టీచర్ బదిలీ తట్టుకోలేక విలపించిన విద్యార్థులు



ఉపాధ్యాయురాలు సంతానలక్ష్మిని చుట్టుముట్టి విలపిస్తున్న విద్యార్థులు

చెన్నై, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): తమకు విద్యాబుద్ధులు నేర్పి అత్యంత ఆత్మీయురాలిగా మెలిగిన ఉపాధ్యాయురాలి బదిలీ ఆ పాఠశాల విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు దిగ్భ్రాంతిని, శోకాన్ని కలిగించింది. యేళ్లతరబడి సేవలందించి తమ ఇంటి మనిషిగా మెలిగిన ఆ టీచర్‌ను విద్యార్థులు, స్థానికులు చుట్టుముట్టి బదిలీపై వెళ్ళకూడదంటూ బోరున విలపించారు. విద్యార్థులు, ఊరివారంతా తనపై ప్రదర్శించిన ఆదరణ చూసి ఆ ఉపాధ్యాయురాలు కూడా విలపిస్తూ అందరి వద్దా సెలవు తీసుకున్నారు. రాణిపేట బెల్ క్వార్టర్స్ ప్రాంగణంలో ఉన్న ప్రభుత్వ ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలలో 17 యేళ్లుగా సంతానలక్ష్మి అనే టీచర్ పనిచేస్తున్నారు. యేళ్లతరబడి ఆ స్కూలులో పనిచేయడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో సన్నిహిత సంబంధాలు అధికమయ్యాయి. ఈ నేపథ్యంలో ఆ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తగ్గటంతో ఆమెను మరో పాఠశాలకు బదిలీ చేశారు. ఆ విషయం తెలుసుకున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తమను విడిచిపెట్టి వెళ్లకూడదంటూ టీచర్ సంతానలక్ష్మిని చుట్టుముట్టి బోరున విలపించారు. బుధవారం ఉదయం పాఠశాల ప్రాంగణం వద్ద చోటుచేసుకున్న ఆ దృశ్యం చూసి సిబ్బంది, ఊరిపెద్దలు, ప్రముఖులు కూడా కంట తడిపెట్టుకున్నారు. సంతానలక్ష్మి పదవీ విరమణ చేయడానికి యేడాది మాత్రమే ఉండటంతో ఈ స్కూలులోనే మరో ఏడాదిపాటు ఆమెను పనిచేయడానికి అనుమతించాలని స్థానికులు విద్యాశాఖ ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు.

విరుదునగర్ పారిశ్రామికవాడలో అగ్ని ప్రమాదం



అగ్నిప్రమాదంలో దగ్ధమైన పరికరాలు

చెన్నై, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): విరుదునగర్ అళగాపురి రోడ్డులోని సిడ్కో పారిశ్రామికవాడలో శివకాశికి చెందిన బాలాజీ అనే పారిశ్రామికవేత్త నడుపుతున్న పాలిథిన్ కవర్ల ప్రింటింగ్ కర్మాగారంలో బుధవారం సంభవించిన అగ్ని ప్రమాదంలో విలువైన పరికరాలు దగ్ధమయ్యాయి. ఆ కర్మాగారం యాంత్రిక విభాగంలో ఏర్పడిన షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. క్షణాల్లో మంటలు వ్యాపించడంతో ఇక్కడ పనిచేస్తున్న కార్మికులు పరుగులు తీశారు. సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక దళం హుటాహుటిన అక్కడికిచేరుకుని మంటలను ఆర్పివేశారు. అప్పటికే అక్కడున్న పరికరాలు దగ్ధమయ్యాయి. విరుదునగర్ బజార్ పోలీసులు కేసు నమోదుచేసుకుని విచారణ జరుపుతున్నారు.

రోడ్ల విస్తరణ పేరిట చెట్లు నరికివేత తగదు



నరికిన చెట్టుకు అంజలి ఘటించేలా నిరసనలో నేతలు, కార్యకర్తలు

పెరంబూర్, సెప్టెంబరు 25: రోడ్ల విస్తరణ పేరిట చెట్లు నరకడం సరికాదని పసుమై తాయగం విజ్ఞప్తి చేసింది. విల్లుపురం జిల్లా తిరుకోవిలూర్ శాసనసభ నియోజకవర్గ పరిధిలోని అరకండనల్లూర్‌లో ప్రభుత్వ ఐటీఐ ఎదురుగా రోడ్డు విస్తరించాలంటూ, ఆ ప్రాంతంలో వందేళ్ల భారీ చెట్టు సహా పలు చెట్లను ఇటీవల నరికివేశారు. దీనికి నిరసనగా పసుమై తాయగం ఆధ్వర్యంలో నరికిన చెట్టుకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ, రోడ్ల విస్తరణ పేరుతో చెట్టు నరకడం తగదని, అలా అడ్డుగా ఉన్న చెట్లను మరో ప్రాంతంలో నాటేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీఎంకే జిల్లా కార్యదర్శి బాలశక్తి, పసుమై తాయగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి లయన్ ఎన్.కన్నన్, కె.పొన్మలై, జిల్లా నిర్వాహకులు మణికంఠన్, కుమరగురపరన్, పర్యావరణ ప్రేమికులు పాల్గొన్నారు.

ఐఐటీ మద్రాస్‌లో డేటా సైన్స్, ఏఐ సర్టిఫికెట్ కోర్సులు

ఐసిఎఫ్, సెప్టెంబరు 25: చెన్నై ఐఐటీలో మద్రాస్‌లో డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), ఎలక్ట్రానిక్ సిస్టమ్స్ అనే సర్టిఫికెట్ కోర్సులు ప్రవేశపెట్టారు. ఐఐటీ మెడ్రాస్ ప్రొఫెసర్లు ఈ సర్టిఫికెట్ కోర్సులకు పాఠ్యాంశాలు రూపొందించారు. ప్లస్ వన్, ప్లస్ టూ విద్యార్థులకు వృత్తి మార్గదర్శక అనుభవాలను నేర్పించాలనే లక్ష్యంతో ఈ కోర్సులు ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఈ నెల 16 నుంచి దరఖాస్తు స్వీకరణ జరుగుతోంది. ఐఐటీతో కలిసి పనిచేయాలనుకొనే పాఠశాలలు https://schoolconnect. study. iitm.ac.in/ అనే వెబ్‌సైట్‌లో నమోదు చేసుకొని, కోర్సులు పూర్తిచేసిన అనంతరం విద్యార్థులకు ఐఐటీ ద్వారా సర్టిఫికెట్లు అందజేయవచ్చని సూచించారు. ఇదివరకే 50 పాఠశాలలు ఐఐటీతో చేరి కోర్సులు అందిస్తున్నాయి.

ఆవడి, తిరుచ్చిలో రైలు డ్రైవర్ శిక్షణా కేంద్రాలు

ఐసిఎఫ్, సెప్టెంబరు 25: రైలు డ్రైవర్ల శిక్షణా కేంద్రాలను ఆవడి, తిరుచ్చిలో ఏర్పాటు చేయనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. భారత రైల్వేలో 20 రకాల్లో 14,800లకు పైగా రైలింజన్లున్నాయి. ఒక్కో రైలింజన్‌లో వేర్వేరు సాంకేతిక పరిజ్ఞానాలున్నాయి. దీని గురించి రైలు డ్రైవర్లు పూర్తిగా తెలుసుకొనేలా కూర్చున్న చోటు నుంచే కంప్యూటర్ సహాయంతో శిక్షణ పొందేలా సిములేటర్ ఏర్పాటుచేయనున్నారు. రాష్ట్రంలో ఆవడి, తిరుచ్చి సహా దేశవ్యాప్తంగా డ్రైవర్లకు శిక్షణ ఇచ్చేలా కేంద్రాలు ఏర్పాటుచేయనున్నట్లు అధికారులు తెలిపారు.

షార్‌లో ఘనంగా సతీష్ ధావన్ జయంతి



సూళ్లూరుపేట, సెప్టెంబరు 25: ఇస్రో మాజీ చైర్మన్ ప్రొఫెసర్ సతీష్ ధావన్ జయంతిని బుధవారం షార్‌లో ఘనంగా నిర్వహించారు. షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ చేతుల మీదుగా షార్ మిషన్ కంట్రోలర్ సమీపంలో ఉన్న సతీష్ ధావన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీహరికోటలో షార్ కేంద్రం ఏర్పాటుకు సతీష్ ధావన్ ఎనలేని కృషి చేశాడని తెలిపారు. అనంతరం షార్ వైద్యశాలలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 123 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో షార్ కంట్రోల్ శ్రీనివాసుల రెడ్డి, అసోసియేట్ డైరెక్టర్ సయ్యద్ అహ్మద్, గ్రూపు డైరెక్టర్ గోపి కృష్ణ, షార్ ఉద్యోగులు పాల్గొన్నారు.

7 వరకు పవన విద్యుత్ ఛార్జీలపై అభిప్రాయ సేకరణ

ఐసిఎఫ్, సెప్టెంబరు 25: పవన విద్యుత్ ఛార్జీలపై అక్టోబరు 7 వరకు ప్రజాభిప్రాయ సేకరణ జరుగనుంది. రాష్ట్రంలో విండ్ మిల్లులు ఏర్పాటుచేసి కేంద్ర విద్యుత్ మార్గంలో అనుసంధానం చేసే సంస్థల నుంచి మెగావాట్‌కు రిసోర్స్ ఛార్జీ పేరుతో రూ.50 లక్షలు వసూలుచేసేందుకు రాష్ట్ర విద్యుత్ బోర్డు హరిత ఇంధన శక్తి సంస్థ నిర్ణయించింది. దీనికి పెట్టుబడిదారులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో, విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ సలహా ప్రకారం, ఛార్జీ వసూలుకు సంబంధించి విద్యుత్ బోర్డు ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టింది. ఈ నెల 7వ తేది వరకు ప్రజలు దీనిపై తమ అభిప్రాయాలు వెల్లడించాలని అధికారులు తెలిపారు.

కొత్త చట్టాలపై హైకోర్టులో పిటిషన్

● కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు

అడయార్, సెప్టెంబరు25: కేంద్రం కొత్తగా తీసుకొచ్చిన మూడు నేర చట్టాలకు వ్యతిరేకంగా తమిళనాడు, పుదుచ్చేరి న్యాయవాద సంఘాల సమాఖ్య దాఖలు చేసిన పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన హైకోర్టు కేంద్రానికి నోటీసులిచ్చింది. భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను హరించేలా కేంద్రం ఈ చట్టాలను తీసుకొచ్చిందని ఆ సమాఖ్య అధ్యక్షుడు మారప్పన్ ఈ పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ కొత్త చట్టాలపై ఎలాంటి చర్చ లేకుండానే ఏకపక్షంగా, స్వతంత్రంగా అమలు చేసిందని ఆయన ఆరోపించారు. భారత రాజ్యాంగ శాసనాలకు వ్యతిరేకంగా ప్రవేశపెట్టిన ఈ చట్టాలను అమలును తక్షణం నిలిపివేయాలని కోరారు. ఈ పిటిషన్‌ను ప్రధాన న్యాయమూర్తి (ఇన్‌చార్జ్) కృష్ణకుమార్, న్యాయమూర్తి జ్యోతిరామన్‌లతో కూడిన ధర్మాసనం విచారణ జరిపి, కేంద్ర వివరణ ఇచ్చేలా నోటీసులు జారీ చేయాలని ఆదేశించింది.

వారాంతపు ప్రత్యేక బస్సులు

పెరంబూర్, సెప్టెంబరు 25: వారాంతపు సెలవులు, పాఠశాలలకు త్రైమాసిక సెలవులు కావడంతో ఈ నెల 27,28,29 తేదీల్లో ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు రాష్ట్ర రవాణా సంస్థ తెలిపింది. ఆ ప్రకారం కిలంబాక్కం బస్ టెర్మినల్ నుంచి తిరువణ్ణామలై, తిరుచ్చి, కుంభకోణం, మదురై, తిరునల్వేలి, నాగర్‌కోయిల్, కన్నియాకుమారి, తూత్తుకుడి, కోయంబత్తూర్, సేలం, ఈరోడ్, తిరుప్పూర్ తదితర నగరాలకు 27వ తేది 395, 28వ తేది 345 ప్రత్యేక బస్సులు నడుపనున్నారు. అలాగే, కోయంబేడు బస్టాండ్ నుంచి తిరువణ్ణామలై, నాగపట్టణం, వేలాంకన్ని, హోసూరు, బెంగళూరు తదితర ప్రాంతాలకు 27, 28 తేదీల్లో తలా 70 ప్రత్యేక బస్సులు నడుపనున్నారు. ఇక, బెంగళూరు, తిరుప్పూర్, ఈరోడ్, కోయంబత్తూర్ నుంచి ఇతర ప్రాంతాలకు 200 బస్సులు, మాధవరం బస్టాండ్ నుంచి 27,28 తేదీల్లో తలా 20 ప్రత్యేక బస్సులు నడుపనున్నారు. సెలవుల తరువాత తిరిగి వచ్చే వారి సౌకర్యార్థం పలు నగరాల నుంచి ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు రవాణా సంస్థ తెలిపింది.

10 కోట్ల మంది తిలకించిన తమిళ ఈ-లైబ్రరీ

పెరంబూర్, సెప్టెంబరు 25: తక్కువ కాలంలో తమిళ్ ఈ-లైబ్రరీని 10 కోట్ల మంది వీక్షించారు. ఈ మేరకు రాష్ట్ర సమాచార, సాంకేతిక, డిజిటల్ సేవల శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి కుమార్ జయంత్ విడుదల చేసిన ప్రకటనలో... 2017 అక్టోబరు 11వ తేది ప్రారంభించిన ఈ-లైబ్రరీని 2021 మే నెల వరకు 1.5 కోట్ల మంది వీక్షించారన్నారు. ఈ ఏడాది జనవరి పాఠకుల సంఖ్య 6.5 కోట్లకు పెరిగిందన్నారు. తమిళ సాహితీవేత్తలు, రచయితలు, విద్యార్థులు అని పలు విభాగాలకు చెందిన వారు ఈ-లైబ్రరీని వీక్షిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం ఈ పాఠకుల సంఖ్య 10 కోట్లకు చేరిందని, www.tamildigitallibrary.in అనే ఈ-లైబ్రరీని ప్రజలు సందర్శించవచ్చని ఆయన తెలిపారు.

6 వరకు త్రైమాసిక సెలవులు పొడిగింపు

● 7న పాఠశాలల పునఃప్రారంభం

ప్యారీస్, సెప్టెంబరు 25: రాష్ట్రంలో త్రైమాసిక పరీక్షల సెలవులను అక్టోబరు 6వ తేది వరకు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పాఠశాలల్లో ప్రారంభమైన త్రైమాసిక పరీక్షలు ఈ నెల 27వ తేదీతో ముగియనున్నాయి. మరుసటిరోజు నుంచి అక్టోబరు 2వ తేది వరకు ఐదు రోజులు మాత్రమే పాఠశాల విద్యాశాఖ సెలవులు ప్రకటించింది. అయితే, ఈ సెలవులు 9 రోజులుగా పొడిగించాలని తమిళనాడు ప్రభుత్వ పాఠశాలల టీచర్ల సమాఖ్య కోరింది. జవాబు పత్రాల మూల్యాంకనం, మార్కుల జాబితా తయారీ తదితర పనుల నిమిత్తం సెలవు దినాలు పొడిగించాలని కోరింది. వారి అభ్యర్థనను పరిశీలించిన పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్, త్రైమాసిక సెలవు రోజులు అక్టోబరు 6వ వరకు పొడిగిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలలు అక్టోబరు 7వ తేది నుంచి పునఃప్రారంభం కానున్నాయి.

కార్ల దొంగ అరెస్ట్

వేలూరు, సెప్టెంబరు 25: స్థానిక కాట్పాడి సమీపం వెంకటాపురం ప్రాంతంలో తమిళనాడు, ఆంధ్ర, కర్ణాటక సహా పలు రాష్ట్రాల నుంచి 40కి పైగా కార్లు దొంగతనం చేసి, వాటి విడిభాగాలు విక్రయిస్తున్న దేవ అలియాస్ దేవేంద్రన్‌ను పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. అతని నుంచి సుమారు రూ.2 కోట్ల విలువైన 41 కార్లు స్వాధీనం చేసుకొని విచారిస్తున్నారు.

విపత్తులపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

వేలూరు, సెప్టెంబరు 25: గుడియాత్తం తాలూకా కార్యాలయ ప్రాంగణంలో జాతీయ విపత్తుల నివారణ బృందం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించింది. విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన ముందు జాగ్రత్తలు, బాధితులకు అందించాల్సిన ప్రాథమిక చికిత్స, విపత్తుల్లో చిక్కుకున్న వారిని రక్షించడం తదితరాలు మాక్ డ్రిల్ ద్వారా చేసి చూపించారు. కార్యక్రమంలో గుడియాత్తం సబ్ కలెక్టర్ సుబ్బలక్ష్మి, ఉప తహసీల్దార్ ఉదయకుమార్, గుడియాత్తం తహసీల్దార్ చంద్రన్, అరక్కోణం జాతీయ విపత్తుల బృందం ఇన్స్‌పెక్టర్ వినీత్‌కుమార్, మున్సిపాలిటీ కమిషనర్ మంగైకరసన్, ఆరోగ్యశాఖ అధికారి మారన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఐసిఎఫ్, సెప్టెంబరు 25: విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు దిగువ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

కోయంబేడు: జై నగర్, అమరావతి నగర్, బృహదీశ్వర నగర్, శక్తి నగర్, వళ్లువర్ రోడ్డు, బాలావినాయకర్ నగర్, వినాయకపురం, అన్నై సత్యా నగర్, తిరుకుమారపురం, తిరువీధి అమ్మన్ ఆలయ వీధి, డా.అంబేడ్కర్ వీధి, టీపీస్పీ నగర్, వందడుగుల రోడ్డు, ఎస్ఏఎఫ్ గేమ్స్ విలేజ్, అళగిరి నగర్, చిన్మయ నగర్, లోకనాథన్ నగర్, ఇందిరా గాంధీ వీధి, మంగల్ నగర్

విల్లివాక్కం: సిడ్కో నగర్ 1 నుంచి 10 బ్లాక్‌లు, అమ్మన్‌కుట్టై, నెహ్రూ నగర్, సిడ్కో ఎస్టేట్, తిరు నగర్, బాబా నగర్, రాజమంగళం మెయిన్ రోడ్డు, సౌత్ హైకోర్టు కాలని. **తిల్లై గంగానగర్:** శక్తి నగర్, బాలాజి నగర్ 1 నుంచి 15 వీధులు, నేతాజీ నగర్ 5 నుంచి 9 వీధులు, ఏజీఎస్ కాలని, వేల్ నగర్, తామరై వీధి, నవీన్ ఫ్లాట్స్, నేతాజీ కాలని మెయిన్ రోడ్డు, ఎంజీఆర్ నగర్

సిడ్కో తిరుముల్లైవాయల్: ఎల్లంపేట, అంబేడ్కర్ నగర్, అన్నై ఇందిరా మెమోరియల్ నగర్, వీరపాండి నగర్, నాగాత్తమ్మన్ నగర్, ఈజీ నగర్

పెరియార్ నగర్: ఎస్సార్పీ ఆలయ ఉత్తర, దక్షిణ వీధులు, జీకేఎం కాలని, పెరియార్ నగర్ అన్ని వీధులు, వెంకట్రామన్ రోడ్డు, జగన్నాథన్ రోడ్డు, జవహర్ నగర్, లోకో ప్రాజెక్ట్, జవహర్ నగర్ రింగ్ రోడ్డు, లోకో వర్క్స్ రోడ్డు, కార్తికేయన్ రోడ్డు.

మెట్రోరైల్వేస్టేషన్‌లో అశ్లీల రీల్స్ తయారీ

● ముగ్గురు విద్యార్థుల అరెస్టు

అడయార్, సెప్టెంబరు 25: స్థానిక కీల్పాక్కం మెట్రో రైల్వే స్టేషన్‌లో తన ప్రియురాలితో కలిసి అశ్లీలంగా రీల్స్ చేస్తున్న యువకుడిని మందలించిన మెట్రో రైల్ అధికారిపై జరిగిన దాడి కేసులో ముగ్గురు విద్యార్థులను పోలీసులు అరెస్టు చేశారు. కీల్పాక్కం నెహ్రూ పార్క్ మెట్రో స్టేషన్‌లో ప్రయాణికులకు తీవ్ర అసౌకర్యం కలిగించేలా ఓ యువకుడు తన ప్రియురాలితో కలిసి రీల్స్ చేస్తున్నాడు. దీన్ని గమనించిన ఆ మెట్రో స్టేషన్ అధికారి ఆ యువకుడిని మందలించాడు. దీంతో అక్కడ నుంచి వెళ్ళిపోయిన ఆ యువకుడు.. కొంతసేపటికి మరో ఇద్దరు స్నేహితులతో కలిసి వచ్చి రైల్వే స్టేషన్ అధికారి ఆకాష్‌పై దాడి చేశాడు. దీనిపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. సీసీ పుటేజీ ఆధారంగా దాడికి పాల్పడిన చింతాద్రిపేటకు కాలేజీ విద్యార్థి అబూబాకర్ సిద్ధిక్, చూలైకు చెందిన విజీ , డెవిస్‌లుగా గుర్తించి మంగళవారం రాత్రి అరెస్టు చేశారు.

బాలికకు అసభ్య చిత్రాలు

● టీచర్ అరెస్టు

పెరంబూర్, సెప్టెంబరు 25: మూడో తరగతి బాలికకు సెల్‌ఫోన్‌లో అసభ్య చిత్రాలు చూపిస్తూ లైంగిక వేధింపులకు పాల్పడిన టీచర్ కటకటాలపాలయ్యాడు. ఉళుందూర్‌పేట సమీపంలోని ఓ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న దురైయరసన్ పాఠశాలలో చదువుతున్న మూడో తరగతి బాలికకు తన సెల్‌ఫోన్‌లో అసభ్య చిత్రాలు చూపించి లైంగిక వేధింపులకు పాల్పడినట్లు సమాచారం. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదుతో పోక్సో చట్టం కింద కేసు నమోదుచేసిన పోలీసులు, టీచర్ దురైఅరసన్‌ను అరెస్ట్ చేశారు.

రూ.25 లక్షల విలువైన ఎర్రచందనం దుంగల స్వాధీనం



ప్యారీస్, సెప్టెంబరు 25: తిరువళ్లూర్ జిల్లా తిరుత్తణి సమీపంలో ఉన్న మురుకంపట్టు జాతీయ రహదారిలో ఆంధ్ర రాష్ట్రం నుంచి అక్రమంగా తరలించిన రూ.25 లక్షల విలువైన ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఆంధ్ర రాష్ట్రం నుంచి ఓ మినీ టెంపో వాహనంలో ఎర్రచందనం దుంగలను స్మగ్లింగ్ చేస్తోందని తిరుత్తణి ఇన్స్‌పెక్టర్ కుమార్‌కు సమాచారం అందడంతో ఆయన తన సిబ్బందితో మురకంపట్టు జాతీయ రహదారిలో మాటువేశారు. ఆ మార్గంలో వేగంగా వచ్చిన వాహనాన్ని నిలిపి తనిఖీ చేసి, అందులో ఉన్న 17 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. దాదాపు 2 వేల కిలోల బరువున్న వాటి విలువ రూ.25 లక్షలుంటుందని అంచనా వేశారు. సంబంధిత వాహనంలో వచ్చిన డ్రైవర్ గణేశన్, క్లీనర్ జగదీశ్వర్‌రెడ్డిలను అరెస్ట్ చేశారు. వీరు చిత్తూరు జిల్లాకు చెందినవారు కావడంతో వారితో పాటు స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం దుంగలను కూడా అటవీ శాఖ అధికారులకు అప్పగించారు.

గుడియాత్తంలో గ్రీవెన్స్





మాట్లాడుతున్న తహసీల్దార్ జ్యోతిక

వేలూరు, సెప్టెంబరు 25: గుడియా త్తం రెవెన్యూ కార్యాలయంలో బుధవారం గ్రీవెన్స్ జరిగింది. కా ర్యక్రమంలో తహసీల్దా ర్ జ్యోతిక పాల్గొని, ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించి, వాటిని పరిశీలిం చి సత్వరం పరిష్కారం చూపాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.అనంతరంతాలూకాపరిధిలోజరుగుతున్న అభివృద్ధికార్యక్రమాలపై గ్రామ నిర్వాహ అధికారులతో తహసీల్దార్ సమీక్షా సమావేశం నిర్వహించారు.

రాణిపేట, రామనాథపురం జిల్లాల్లో 14 టాస్మాక్ దుకాణాల్లో క్యూ ఆర్ కోడ్

ప్యారీస్, సెప్టెంబరు 25: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న టాస్మాక్ మద్యం దుకాణాల్లో ఎమ్మార్పీ ధర కంటే అధికంగా వసూలుచేయకుండా క్యూ ఆర్ కోడ్ విధానం బుధవారం అమలులోకి వచ్చింది. అందువల్ల క్వార్టర్ నుంచి ఫుట్ బాటిల్ వరకు రూ.10 నుంచి రూ.50 వరకు అధికంగా వసూలుచేస్తున్న విధానానికి చెక్ పెట్టే విధంగా తొలివిడతగా రాణిపేట జిల్లాలో ఉన్న ఏడు టాస్మాక్ దుకాణాలు, రామనాథపురం జిల్లాలోని ఏడు టాస్మాక్ దుకాణాల్లో పరిచయమైంది. ఈ 14 దుకాణాల్లో మద్యం సీసాలపై ఉన్న ఎమ్మార్పీ ధరలకే మద్యం విక్రయించాలని, అధిక ధర డిమాండ్ చేసిన వారిపై చట్టపరమైన చర్యలుంటాయని టాస్మాక్ యాజమాన్యం ఉత్తర్వులు జారీచేసింది. దుకాణాల్లో ఉన్న క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేసి ఆన్‌లైన్ ద్వారా నగదు చెల్లించి ఆయా మద్యపానీయాలకు సంబంధించిన బిల్లును టాస్మాక్ సిబ్బంది నుంచి పొందవచ్చని, మద్యపానప్రియులు ఏవైనా అవకతవకలుంటే ఫిర్యాదు చేయవచ్చని టాస్మాక్ సంస్థ తెలిపింది.

ఓటర్లకు ఎంపీ కృతజ్ఞతలు



ఓటర్లకు కృతజ్ఞతలు తెలుపుతున్న ఎంపీ కదిర్ ఆనంద్

వేలూరు, సెప్టెంబరు 25: ఆనైకట్టు నియోజకవర్గ పరిధిలోని పుత్తూరు, పొయిగై, సత్యమంగళం, ఇళవమ్పాడి, మరుదవల్లిపాళ్యం తదితర పంచాయతీల్లో వేలూరు ఎంపీ కదిర్ ఆనంద్ బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా గత పార్లమెంటు ఎన్నికల్లో తనను గెలిపించిన ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీ వెంట జిల్లా పరిషత్ కమిటీ అధ్యక్షుడు బాబు, నేతలు కుమారపాండ్యన్, వెంకటేశన్, పలువురు నేతలు, కార్యకర్తలున్నారు.

సవుక్కు శంకర్‌పై గూండా చట్టం రద్దు

● సుప్రీంకోర్టు ఉత్తర్వులు

ప్యారీస్, సెప్టెంబరు 25: యూ ట్యూబర్ సవుక్కు శంకర్‌ను రెండోసారి గూండా చట్టంలో అరెస్ట్ చేసే ఉత్తర్వులు రద్దు చేస్తూ సుప్రీంకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. ఆయనపై నమోదైన కేసులు పెండింగ్‌లో లేని పక్షంలో వెంటనే బెయిలుపై విడుదల చేయాలని ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. మహిళా కానిస్టేబుళ్లను కించపరిచేలా వ్యాఖ్యానించిన సవుక్కు శంకర్‌ను అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో, ఆయనపై గూండా చట్టం ప్రయోగించి జైలుకు తరలిస్తూ మే నెల చెన్నై పోలీస్ కమిషనర్ ఉత్తర్వులు జారీచేశారు. దీనిని వ్యతిరేకిస్తూ ఆయన తల్లి కమల మద్రాసు హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలుచేశారు. ఇదిలా ఉండగా, ఆగస్టు 12వ తేదీ తేని జిలా ఎస్పీ శివప్రసాద్ ప్రతిపాదన మేరకు సవుక్కు శంకర్‌పై గూండా చట్టం కింద కేసు నమోదుచేయాలని కలెక్టర్ ఆర్వీ సజీవన ఉత్తర్వులు జారీచేశారు. ఈ ఉత్తర్వులకు స్టే విధించాలని కోరుతూ కమల దాఖలుచేసిన పిటిషన్ బుధవారం సుప్రీంకోర్టులో విచారణకు వచ్చింది. ఇరుతరపు వాదనల అనంతరం సవుక్కు శంకర్‌పై రెండో సారి దాఖలైన గూండా చట్టం ఉత్తర్వులు రద్దు చేయడంతో పాటు ఆయనపై కేసులు పెండింగ్‌లో లేని పక్షంలో స్వంత పూచీకత్తుపై విడుదల చేయాలంటూ సుప్రీంకోర్టు ఆదేశాలు జారీచేసింది.

ఆన్‌లైన్ వ్యాపారం పేరిట రూ.14.77 లక్షల మోసం

పెరంబూర్,సెప్టెంబరు25:తంజావూరు జిల్లాలో ఆన్‌లైన్ వ్యాపారమంటూ మహిళవద్ద రూ.14.77లక్షలు కాజేసిన వ్యక్తులకోసం పోలీసులు విచారిస్తున్నారు. తంజావూరు మారియమ్మన్ ఆలయ వీధికి చెందిన 42 ఏళ్ల మహిళకు 2023 నవంబరు నెలలో వాట్సాప్‌లో మెసేజ్ వచ్చింది.ఆన్‌లైన్‌లో వ్యాపారంలో పెట్టుబడి పెడితే అధిక లాభం లభిస్తుందని ఆ మెసేజ్‌లో ఉంది. దీనిని నమ్మిన ఆమె, ఆ ప్రకటనలో నెంబరుకు సంప్రదించగా, ఓ వ్యక్తి ఆమెను సంప్రదించి పెట్టుబడుల వివరాలు తెలిపారు.తొలుత చిన్న మొత్తంగా పెట్టిన పెట్టుబడులకు లాభాలు రావడంతో, ఆమె పలువిడతలుగా రూ.14.77 లక్షలు పంపించారు. అనంతరం ఆ వ్యక్తి ఆమె ఫోన్ నెంబరును బ్లాక్ చేశాడు. దీంతో మోసపోయానని గ్రహించిన బాధితురాలు ఫిర్యాదు చేయడంతో తంజావూరు సైబర్ క్రైం పోలీసులు కేసు నమోదుచేసి విచారిస్తున్నారు.

అందరూ ఎంజీఆర్ కాలేరు

● నిర్మాత కె.రాజన్


మీడియా సమావేశంలో 'దిల్ రాజా' చిత్రబృందం

చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టిన ప్రతి ఒక్కరూ మహానటుడు ఎంజీఆర్ స్థాయికి చేరుకోవాలని ఆశపడుతున్నారని, ఇది సాధ్యమయ్యే పనేనా అని ప్రముఖ నిర్మాత, నటుడు కె.రాజన్ ప్రశ్నించారు. గోల్డెన్ ఈగల్ స్టూడియోస్ పతాకంపై కోవై బాలసుబ్రమణియం నిర్మాణంలో ఏ. వెంకటేష్ దర్శకత్వంలో విజయ్ సత్య, షెరీన్ కాంబినేషన్‌లో తెరకెక్కిన 'దిల్ రాజా' చిత్రం ఈ నెల 27న విడుదలకు సిద్ధమైంది. ఈసందర్భంగా చిత్ర బృందం నగరంలో మీడియా సమావేశం నిర్వహించింది. సీనియర్ నిర్మాత కె.రాజన్ ముఖ్య అతిథిగా పాల్గొని చిత్ర బృందాన్ని అభినందించారు. సంగీత దర్శకుడు అమ్రీష్, నటి కనికా మాన్, నిర్మాత తిరుమలై, నటి వనిత, చిత్ర దర్శకుడు ఏ.వెంకటేష్, ఇతర నటీనటులు, టెక్నీషియన్లు పేర్కొన్నారు. 'చిత్ర బృందానికి అభినందనలు తెలియజేసిన నిర్మాత కె.రాజన్ ఈ సినిమాకు సంగీతం అందించిన అమ్రీష్ మరింత ఉన్నతస్థాయికి చేరుకోవాలన్నారు. ప్రచార కార్యక్రమానికి రాని హీరోయిన్లకు మళ్ళీ తమిళంలో అవకాశం ఇవ్వకూడదన్నారు. దర్శకుడు వెంకటేష్ కేవలం 32 రోజుల్లో సినిమా పూర్తి చేయడం గొప్ప విషయమని ట్రైలర్ బాగుందని తెలిపారు. ఇపుడు చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టే నటులు ఎంజీఆర్ కావాలని ఆశపడుతున్నారు. కానీ, ఎంజీఆర్ పడిన కష్టాలు ఎవరికి తెలుసు. ఆరంభం నుంచి కష్టపడిన వ్యక్తి. విజయ్ సత్య కూడా కష్టపడి ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఆశీర్వదించారు. హీరో విజయ్ సత్య మాట్లాడుతూ, 'ప్రతి ఒక్కరూ ఎంజాయ్ చేసేలా దర్శకుడు ఈ చిత్రాన్ని రూపొందించారు. మీడియా కూడా ఆదరించి చిత్ర విజయానికి సహకరించాలని కోరారు. దర్శకుడు ఏ.వెంకటేష్ మాట్లాడుతూ, 'ఈ సినిమాలో నటించిన ఇద్దరు హీరోయిన్లు చిత్ర ప్రమోషన్‌కు రాలేదు. మా కంటే మీ హీరోలను పిలుచుకోండి అంటూ ఎంతో చాకచక్యంగా తప్పుకున్నారు. ఇది తమిళ చిత్రపరిశ్రమలో నెలకొన్న పరిస్థితి. అమ్రీష్ ఎంతో ఓపిగ్గా మంచి ట్యూన్స్ ఇచ్చారు. హీరో ప్రతిభకు మంచి పేరు ప్రఖ్యాతలు లభిస్తాయి' అని అన్నారు.

చిత్రజ్యోతి



లారెన్స్ సరసన ప్రియాంక

రాఘవ లారెన్స్ సరసన ప్రియాంకా మోహన్ హీరోయిన్‌గా నటించనున్నారు. 'రెమో', 'సుల్తాన్' వంటి సూపర్‌హిట్ చిత్రాలను తెరకెక్కించిన దర్శకుడు భాగ్యరాజ్ కన్నన్ రూపొందించే 'బెంజ్' చిత్రంలో కథానాయికగా ప్రియాంక మోహన్‌ను ఎంపిక చేశారు. ప్రముఖ దర్శకుడు లోకేశ్ కనకరాజ్‌కు చెందిన జి స్క్వాడ్ సహకారంతో ఫ్యాషన్ స్టూడియోస్, ది రూట్ సంస్థలు సంయుక్తంగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాయి. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ కార్యక్రమాలు శరవేగంగా సాగుతుండగా, హీరోయిన్‌గా ప్రియాంక మోహన్‌ను ఎంపిక చేసినట్టు నిర్మాణ సంస్థలు వెల్లడించాయి. 'బెంజ్' సినిమాను 'లోకేష్ సినిమాటిక్ యూనివర్స్' (ఎల్‌సీయు)లో అనుసంధానం చేసే ఆలోచనలో దర్శకుడు లోకేష్ కనకరాజ్ ఉన్నారు. అందుకు తగినట్టుగానే ఈ స్క్రిప్టు సిద్ధం చేసినట్టు తెలుస్తుంది. 'ఎల్‌సీయూ' లైనప్‌లోనే 'ఖైదీ', 'విక్రమ్', 'లియో' వంటి చిత్రాలు విడుదలయ్యాయి. ఈ ఎల్‌సీయూలో తుది చిత్రంగా 'విక్రమ్-2' ఉంటుందని లోకేశ్ కనకరాజ్ ఇప్పటికే ప్రకటించిన విషయం తెల్సిందే.

జీటీ4 కార్ రేసింగ్‌కు సిద్ధమవుతున్న అజిత్

● స్వాగతించిన నరేన్ కార్తికేయన్

కోలీవుడ్ అగ్రహీరో అజిత్‌కు కార్, బైక్ రేసింగ్, షూటింగ్‌లంటే అమితమైన పిచ్చి. ఒక వైపు సినిమాల్లో నటిస్తూనే జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సాధిస్తున్నారు. ఈ క్రమంలో ఆయన వచ్చే యేడాది యూరోపియన్ జీటీ4 కార్ రేసింగ్ పోటీలకు సిద్ధమవుతున్నారు.ఈ విషయాన్ని ఆయన స్నేహితుడు, ప్రముఖ రేసర్ నరేన్ కార్తికేయన్ తన ఎక్స్ ఖాతాలో వెల్లడించారు. 'నా మెగాస్టార్, స్నేహితుడు అజిత్ కుమార్ 2025లో జరిగే మోటార్ స్పోర్ట్స్ జీటీ4 రేసింగ్ పోటీల్లో పాల్గొని పునరాగమనం చేసేందుకు సాధన చేస్తున్న విషయం తెలుసుకుని ఎంతో సంతోషిస్తున్నాను. ఆయన నిజంగా ఒక విలక్షణ నటుడు మాత్రమే కాదు మంచి వ్యక్తి. నిజం చెప్పాలంటే కార్ రేసింగ్‌లో అనుభవం లేకపోయినప్పటికీ 2010లో ఎఫ్ఐఏ ఎఫ్2 విభాగంలో పాల్గొన్న విషయం నాకు బాగా గుర్తుంది. అతని ప్రతిభకు హద్దులు లేవు. అభినందనలు తల... నేను మీకు శిక్షణ ఇచ్చి, మీరు అమితంగా ఇష్టపడే రేసింగ్ పోటీలకు సన్నద్ధం చేయగలిగితే అది నా భాగ్యంగా భావిస్తాను' అని నరేన్ కార్తికేయన్ పేర్కొన్నారు.


అజిత్ - నరేన్ కార్తికేయన్

అన్ని పట్టణాల్లో సంగీత కచేరీలు

● ఇళయరాజా



ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా ఇప్పటి వరకు విదేశాలతో పాటు దేశంలోని మెట్రో నగరాల్లో మాత్రమే సంగీత విభావరి కార్యక్రమాలను నిర్వహించారు. ఇకపై తమిళనాడులోని అన్ని పట్టణాల్లో మ్యూజికల్ నైట్స్ నిర్వహిస్తానని ఆయన వెల్లడించారు. ఇదే విషయంపై ఆయన ఇటీవల కుంభకోణంలో జరిగిన మ్యూజికల్ ఫెస్ట్ కార్యక్రమానికి సంబంధించిన వీడియో షేర్ చేస్తూ ఎక్స్ ఖాతాలో ఓ ట్వీట్ చేశారు. 'భారీ వర్షంలోనూ నా సంగీత కచ్చేరి ఆస్వాదించడానికి వచ్చిన కుంభకోణం ప్రజలారా... మీ ఆదరణ, సహకారం మరిచిపోలేనిది. ఇకపై నా సంగీత కచ్చేరిలు కేవలం మెట్రో నగరాల్లోనే కాకుండా, తమిళనాడులోని అన్ని పట్టణాల్లో నిర్వహిస్తాను' అని ప్రకటించారు. కాగా, ఈ నెల 14న కుంభకోణంలో నిర్వహించిన మ్యూజికల్ నైట్ కార్యక్రమానికి ఒక్క తంజావూరు జిల్లా వాసులే కాకుండా, ఇతర జిల్లాలకు చెందిన సంగీత ప్రియులు కూడా భారీగా తరలివచ్చారు. కచ్చేరి ప్రారంభమయ్యే సమయంలో చిన్నపాటి వర్షం కురిసింది. అయినప్పటికీ ఎవరూ కదలకుండా కూర్చొండిపోయారు. దీంతో ఇళయరాజా చలించిపోయారు. అందుకే ఇకపై తన కచ్చేరిలను పట్టణాల్లో కూడా నిర్వహించాలని ఆయన నిర్ణయం తీసుకున్నారు.

జమిలి ఎన్నికలొద్దు

● ఎండీఎంకే ఎంపీ వైగో

ప్యారీస్, సెప్టెంబరు 25: ఆచరణకు సాధ్యం కాని జమిలి ఎన్నికల నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని ఎండీఎంకే ఎంపీ, ప్రధాన కార్యదర్శి వైగో డిమాండ్ చేశారు. ఎగ్మూర్‌లోని పార్టీ కార్యాలయం 'తాయగం'లో బుధవారం ఉదయం ఆ పార్టీ ప్రిసీడియం ఛైర్మెన్ అర్జునరాజ్ నేతృత్వంలో ఉన్నతస్థాయి కమిటీ నిర్వాహకుల సమావేశం జరిగింది. ఈ సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించిన తీర్మానాలను సమావేశం అనంతరం వైగో మీడియాకు వివరించారు. ఒకే దేశం-ఒకే ఎన్నిక నిర్వహించడం సాధ్యం కాదని, ఇది భారత రాజ్యాంగానికి విరుద్ధమన్నారు. పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికలను ఒకే సమయంలో నిర్వహించాలంటే పలు రాష్ట్రాల పదవీ కాలం పూర్తికాని అసెంబ్లీలను రద్దు చేయాల్సి ఉంటుందని, అయితే ఇందుకు దేశంలోని అన్ని రాష్ట్రాలు ఏకాభిప్రాయంతో ఉండవని తెలిపారు. జమిలి ఎన్నికలనేవి రాష్ట్ర హక్కులను బలవంతంగా లాక్కొనే చర్యలని, ఇన్ని సమస్యలతో కూడిన జమిలి ఎన్నికల నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం తక్షణం వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర జాలర్లు చేపల వేటలో స్వేచ్ఛగా పాల్గొనేలా, శ్రీలంక నావికాదళం దాడులు అడ్డుకోవడం తదితర చర్యలపై కేంద్ర ప్రభుత్వం లంక ప్రభుత్వంతో చర్చించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవిని రీకాల్ చేయాలని వైగో కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.


ఎండీఎంకే సమావేశంలో పాల్గొన్న వైగో, దురైవైగో తదితరులు

హొగెనేకల్ జలపాతంలో పెరిగిన ఇన్‌ఫ్లో

చెన్నై, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని జలాశయాల పరివాహక ప్రాంతాలు, రాష్ట్రంలోని కావేరి నీటి పరివాహక ప్రాంతాలైన అంజెట్టి, కేరట్టి, నాట్రామ్ పాళయంలో మంగళవారం రాత్రి నుండి బుధవారం వేకువజాము వరకు కుండపోతగా వర్షాలు కురవటంతో హొగెనేకల్ జలపాతంలో ప్రవేశిస్తున్న జలాల పరిమాణం ఉన్నట్టుండి అధికమైంది. గత రెండువారాలుగా ఆ జలపాతంలోకి మూడువేల ఘనపుటడుగల మేర జలాలు ప్రవేశించాయి. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం ఆ జలపాతంలో ఉన్నట్టుండి ఒక్కసారిగా ఐదువేల ఘనపుటడుగుల చొప్పున జలాలు ప్రవేశించాయి. దీంతో ప్రధాన జలపాతం, సినీఫాల్స్, ఐవర్‌బాని తదితర జలపాతాల వద్ద నీటి ఉధృతి కూడా అధికమైంది. దీనితో బుధవారం ఉదయం నుండి ప్రధాన జలపాతం, కావేరివాగులో స్నానం చేయడానికి పర్యాటకులు పోటీపడ్డారు.


హొగెనేకల్ జలపాతంలో ఉధృతంగా ప్రవహిస్తున్న జలాలు

ఏసీసీ ఆధ్వర్యంలో రసిక్‌లాల్ స్మారక ఉపన్యాసాలు



ఐఐటీ మద్రాస్ కామకోటికి జ్ఞాపిక అందజేస్తున్న ఏసీసీ అధ్యక్షురాలు ఇందిరాదత్తు

అడయార్, సెప్టెంబరు 25: ఆంధ్రా చాంబర్ ఆఫ్ కామర్స్ (ఏసీసీ) ఆధ్వర్యంలో రసిక్‌లాల్ ఎం.మెహతా స్మారక ఉపన్యాసాలను ప్రారంభించారు. నగరంలోని ఒక స్టార్ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో ఐఐటీ మద్రాస్ డైరెక్టర్ వి.కామకోటి ముఖ్యఅతిథిగా హాజరై మెమోరియల్ ఉపన్యాసాలను ప్రారంభించారు. ఇందులో ఏసీసీ అధ్యక్షురాలు డాక్టర్ వీఎల్ ఇందిరా దత్తు, ఏసీసీ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు, మాజీ అధ్యక్షుడు, నగరంలోని వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏసీసీ అధ్యక్షురాలు ఇందిరా దత్తు మాట్లాడుతూ, కామకోటి ఉపన్యాసం కోసం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నట్టు తెలిపారు. పరిశ్రమలు, ప్రభుత్వం, విద్యాసంస్థలను ఒక అనధికారిక వాతావరణంలో సజీవమైన ఆలోచనల మార్పిడిలో ఒకే గొడుగు కిందకు తీసుకుని రావడంతో ఏసీసీ ఎంతగానో కృషి చేస్తుందన్నారు. కొత్త సాంకేకతితో పరిశ్రమలు మరింతగా అభివృద్ధి చెందేందుకు వీలుగా వి.కామకోటి తనవంతు సహకారం అందించాలని ఆమె కోరారు.

తిరుమల బ్రహ్మోత్సవాలకు ప్రత్యేక బస్సులు

పెరంబూర్, సెప్టెంబరు 25: తిరుమల బ్రహ్మోత్సవాలకు రాష్ట్రంలోని పలు నగరాల నుంచి తిరుపతికి ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు రాష్ట్ర రవాణా సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. ప్రపంచ ప్రసిద్ధి చెందిన తిరుమల శ్రీవారి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు అక్టోబరు 4వ తేది ధ్వజారోహణంతో ప్రారంభం కానున్నాయి. బ్రహ్మోత్సవాలకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం చెన్నై, తిరుచ్చి, తంజావూరు, సేలం, కోయంబత్తూర్, మదురై, కారైక్కుడి, కుంభకోణం, తూత్తుకుడి, పుదుచ్చేరి తదిత ప్రాంతాల నుంచి ఈ నెల 30 నుంచి అక్టోబరు 13వ తేది వరకు ప్రత్యేక బస్సులు నడుపున్నామని, ప్రయాణికులు ముందస్తు రిజర్వేషన్‌కు టీఎన్ఎస్టీసీ వెబ్‌సైట్ సంప్రదించాలని అధికారులు తెలిపారు.

'కేవైఎన్' యాప్‌కు విశేష స్పందన

చెన్నై, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): దేశంలో మొట్టమొదటి హైపర్ లోకల్ యాప్ 'నో యువర్ నైబర్ హుడ్' (కేవైఎన్)కు విశేష స్పందన వస్తున్నట్లు నిర్వాహకులు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఫిబ్రవరిలో ఈ యాప్‌ను ఆవిష్కరించగా, ఇప్పటి వరకూ 50 వేల మందికి పైగా డౌన్‌లోడ్ చేసుకున్నట్లు సంస్థ సీఈవో గాయత్రి త్యాగరాజన్ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. తాము వ్యక్తులను వారి పరిసర ప్రాంతాలకు కనెక్ట్ చేస్తామని, సమాజంలోని ప్రతి ఒక్కరికీ వారి కోసం ఒక స్థానం ఏర్పరచుకోవడానికి, వారి ప్రతిభను ప్రదర్శించేందుకు, వ్యాపార సంబంధాలకు తోడ్పడతామని వివరించారు.

ప్రజా ఫిర్యాదులపై తక్షణ పరిష్కారం


పోలీస్ కమిషనర్ అరుణ్‌కు తమ సమస్యలు విన్నవించుకుంటున్న వృద్ధుడు

● చెన్నై పోలీస్ కమిషనర్ అరుణ్

ప్యారీస్, సెప్టెంబరు 25: ప్రజల ఫిర్యాదులు పరిశీలించి తక్షణ చర్యలు చేపడుతున్నట్లు గ్రేటర్ చెన్నై పోలీస్ కమిషనర్ అరుణ్ పేర్కొన్నారు. వెప్పేరిలోని పోలీస్ కమిషనర్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. 37 అర్జీలను పరిశీలించిన ఆయన, వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరింపజేయనున్నట్లు మీడియాకు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషినల్ పోలీస్ కమిషనర్ మేఘలీన సహా పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఒంగోలు మాజీ ఎంపీ పార్వతమ్మ మృతికి ఆచార్య సీఎంకే రెడ్డి సంతాపం

ప్యారీస్, సెప్టెంబరు 25: ప్రముఖ పారిశ్రామికవేత్త దివంగత మాగుంట సుబ్బరామరెడ్డి సతీమణి మాజీ ఒంగోలు పార్లమెంటు సభ్యురాలు పార్వతమ్మ మృతికి అఖిల భారత తెలుగు సమాఖ్య (ఏఐటీఎఫ్) ప్రగాఢ సంతాపం ప్రకటించింది. సమాఖ్య అధ్యక్షులు ఆచార్య సీఎంకే రెడ్డి బుధవారం విడుదల చేసిన సంతాప ప్రకటనలో... ఒంగోలు నియోజకవర్గానికి కొన్ని దశాబ్దాలుగా మాగుంట కుటుంబం చేసిన సేవలు ఎనలేనివని కొనియాడారు. సుబ్బరామరెడ్డి అకాల మరణంతో రాజకీయాల్లోకి వచ్చిన పార్వతమ్మ సమాజ శ్రేయస్సు కోసం కృషిచేశారని, ఆమె పవిత్ర ఆత్మకు శాంతి ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

కాలుష్యరహిత వేలూరు కోసం...


తీర్థగిరి కొండల్లో విత్తనపు బంతులు విసురుతున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

పనులు ప్రారంభించిన కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, సెప్టెంబరు 25: కాలుష్య రహిత వేలూరు జిల్లా కార్యక్రమంలో భాగంగా కొండ ప్రాంతాల్లో విత్తనాలు నాటే పనులను కలెక్టర్ సుబ్బులక్ష్మి బుధవారం ప్రారంభించారు. ఇందుకోసం పలువురు సమాజ సేవకులు మూడు నెలలుగా తిరువణ్ణామలై జవ్వాది కొండల్లో పలురకాల చెట్ల విత్తనాలు సేకరించారు. ఈ నెల 10వ తేది కాట్పాడి ఆక్సీలియం కళాశాల విద్యార్థినులు సేకరించిన సుమారు 5 లక్షలకు పైగా విత్తనాలతో బంతులు తయారుచేశారు. ఈ బంతులను జిల్లాలోని తీర్థగిరి కొండల్లో విసిరే కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. గుడియాత్తం ఉల్లిమలై కొండలు, తొరప్పాడి కొండ ప్రాంతాల్లో విత్తనాల బంతులు వేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కార్తికేయన్, అమ్ములు విజయన్, కార్పొరేషన్ మేయర్ సుజాత, మండల కమిటీ అధ్యక్షులు నరేంద్రన్, యూసఫ్‌ఖాన్, గ్రామీణాభివృద్ధి పథక డైరెక్టర్ సెంథిల్ కుమారన్, కార్పొరేషన్ కమిషనర్ జానకి, వేలూరు తహసీల్దార్ బాలసుబ్రమణి, గుడియాత్తం తహసీల్దార్ సుబలక్ష్మి, విద్యార్థినీ, విద్యార్థులు, పలు శాఖల అధికారులు, సమాజసేవకులు పాల్గొన్నారు.



బాలమురుగన్ ఆలయంలో ఆర్థికశాఖ మంత్రి

చెన్నై, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక తండలంలోని సవీత మెడికల్ కాలేజీ ప్రాంగణంలో వున్న బాలమురుగన్ ఆలయాన్ని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బుధవారం సందర్శించారు. ఆలయంలో బాలమురుగన్ విగ్రహప్రతిష్ఠా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కుంద్రక్కుడి తిరువన్నామలై ఆధీనం, తిరుపెరుంతిరు పొన్నాంబళ అడిగళార్, మయిలం బొమ్మపురం ఆధీనం, సవీత యూనివర్సిటీ ఛాన్స్‌లర్ డాక్టర్ ఎన్ఎం వీరయ్యన్ తదితరులు పాల్గొన్నారు.

3 నుంచి అయ్యప్ప ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు

పెరంబూర్, సెప్టెంబరు 25: స్థానిక మహాలింగపురంలో ఉన్న అయ్యప్ప గురువాయురప్పన్ ఆలయంలో అక్టోబరు 3 నుంచి 13వ తేది వరకు నవరాత్రి ఉత్సవాలు జరుగనున్నాయి. ఉత్సవ ఏర్పాట్లపై ఆలయ మేనేజర్ అనీస్ కుమార్ మాట్లాడుతూ... ఉత్సవాల రోజుల్లో సరస్వతి పూజ నిర్వహించనున్నామన్నారు. ఈ పూజలో పాల్గొనేందుకు విద్యార్థులు తమ పుస్తకాలను ప్యాక్ చేసి, దానిపై పేరు, చిరునామా రాసి పంపించాలని, 13వ తేది పూజల అనంతరం ఆ పుస్తకాలు తిరిగి అందజేయనున్నామని తెలిపారు. 13వ తేది ఉదయం 7 నుంచి రాత్రి 10 గంటల వరకు విద్యారంభ పూజ జరుగుతుందని, ఇందులో పాల్గొనే భక్తులు తమ పేర్లు 044-28171197, 21973197, 8807918811,22 అనే నెంబర్లు సంప్రదించి ముందుగా నమోదుచేసుకోవాలని సూచించారు. ఉత్సవాల సందర్భంగా ప్రతి రోజు సాయంత్రం 6.45 గంటల నుంచి భరత నాట్యం, భక్తిగీతాల ఆలాపన సహా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని ఆయన తెలిపారు.


సచివాలయంలో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్న సిఫీ టెక్నాలజీస్ అధ్యక్షుడు రాజు విగేసనా, పెట్టుబడుల విభాగం అధ్యక్షుడు తలీఫ్‌కౌల్, అదనపు డైరెక్టర్ శ్రీవాణి



ఐదు నిమిషాల్లో ఒకేసారి రెండు చేతులతో 12 తిరుక్కురళ్ సూక్తులు రాసి ఇండియా బుక్‌ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించుకున్న తిరునల్వేలి బాలిక ఎస్.శాంతా షర్మిల తల్లిదండ్రులతో కలిసి బుధవారం సచివాలయంలో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ను కలిసిన దృశ్యం


చెన్నై గిండిలోని కలైంజర్ శతజయంతి స్మారక ఆస్పత్రిలో వీల్‌చైర్‌లో ఉన్న రోగి వద్ద ఆరోగ్యపరిస్థితిని అడిగి తెలుసుకుంటున్న ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం